అల్లుని కోరిక

శ్రీమతి ఓలేటి సూర్యప్రభ

మనియార్డరు పుచ్చుకున్నారు ఆనందరావుగారు. దానితోకూడా వచ్చిన కవరు చింపి చదివారు ఆశ్చర్యంతోనే. "అసలు మనియార్డరు ఎక్కడనుండి వస్తుంది నాకు" తనలో తనే ప్రశ్నించుకున్నారు. చదువుతూంటే ఆనందరావుగారి కళ్లు ఆనందంతో అశ్రువులు రాల్చాయి. ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. అంతట్లో ఆయన ముఖం ప్రొద్దున్న కోసిన మల్లెపువ్వు సాయంకాలానికి అయినట్లు అయింది. ఆయన హృదయం సంతోషంతోనూ బాధతోనూ పెనవేసుకుంది.

ఇంతట్లో "మనియార్డరా! ఎక్కడనుండీ!" అంటూ ఇంటిల్లిపాదీ ఆయనచుట్టూ మూగారు. "ఆ, ఏదో పాతబాకీ, రాదనుకున్నదే, అయిదు రూపాయలు" అన్నారు ఆనందరావుగారు. తేలిగ్గా నిట్టూర్చి. అంతా చక్కాబోయారు.

2

"ఉత్తరం వచ్చిందండీ!" అంది సావిత్రి. "ఎక్కడనుండి" అన్నాడు సుబ్బారావు. "మా నాన్నగారు వ్రాశారండీ" అంది. అతను మౌనం ధరించాడు. సావిత్రి ఉత్తరం ఇచ్చింది.

"చిరంజీవి అల్లునకు ఆశీర్వచనములు. నేను చేసిన వాగ్దానం చెల్లించగలనని ఆశిస్తూ ఈ పండుగకు సకుటుంబంగా రావాలని కోరుచున్నాను. ఇక్కడ అందరం కులాసాగా నున్నాము. మీ అందరి క్షేమం వ్రాయగోరుచున్నాను. పాపకు దీవనలు. పండక్కి రావడానికి అంగీకారాన్ని తెలుపుతావని తలుస్తున్నాను.

ఇట్లు

C. ఆనందరావు"

చదివి బల్లమీద పడేశాడు. సావిత్రి అతని ముఖంలో ఏదైనామార్పు వచ్చిందేమో అని ఆత్రంగా చూసి ఎటూ పోల్చలేకపోయింది. "మూడేళ్లనుండి లేనిదబ్బు ఇప్పుడెలా వచ్చింది? అంతా నాటకం. తప్పిపోతే చాలునని ఊరుకున్నారు" అన్నాడు సుబ్బారావు. "కన్నకడుపు కాదుటండీ! ఎన్నాళ్లుండబట్టుకోగలరు? మీ పట్టుదల మీరు ఒదలరాయె. మన పాప పుట్టాక వాళ్లు చూడలేదుగదా? ఎలాగో కష్టపడి మీ కోర్కె చెల్లిస్తే మనం కళ్ళబడతాం అనేగా! వాళ్ళ బాధ. పండక్కి అక్కయ్యలందరూ వస్తారు. చూడాలనుందండీ" అంది ప్రాధేయపడుతూ. "సరే. కానీ" అన్నాడు గంభీరంగా ముఖంపెట్టి. సావిత్రి చిరునవ్వు నవ్వుకుంది తనలో. పాపను మోచేతుల మీద ఎత్తుకొని చరచర వంటింట్లోకి వెళ్ళింది. వాలు జడ వీపుమీద నాట్యంచేసింది ఆమె నడుస్తూంటే.

3

ఆనందరావుగారి అల్లుళ్ళూ-కూతుళ్ళూ అందరూ ఒక్కొక్కరే వస్తున్నారు పండక్కి. ఆఖరి కూతురు సావిత్రి మాత్రం రాలేదు. అక్కలందరికీ మనస్సులో బాధ మెదుల్తూనే ఉంది కడగొట్టు చెల్లెలు రాలేదని. ఆనందరావుగారూ రాజేశ్వరమ్మగారూ అహర్నిశలు వాపోతూనే ఉన్నారు. అయినా ఆనంద రావుగారు మాత్రం ఆ బాధలోనే ఏదో కొంత తృప్తిపొందినట్లు కనబడుతున్నారు.

మధ్యాహ్నం పదకొండు గంటలైంది. అంతా భోజనాలకు లేస్తున్నారు. వచ్చేవాళ్ళలో నాలుగవ అల్లుడు మాత్రం ఇంకా రాలేదు. చీమ చిటుక్కు మంటే వీధివేపు చూస్తోంది రమ. ... వీధి తలుపు

దగ్గిర శబ్దం వినిపించింది. రమ వెళ్ళి తలుపు తీసింది. సావిత్రీ, పాపా, సుబ్బారావూ వచ్చారు రమ తన కళ్ళను నమ్మలేకపోయింది. నిజంగా సావిత్రేనా! మరదికి కోపం ఎలా తగ్గింది? ఆనందం పట్టలేక సావిత్రిని కౌగలించుకుంది. చిన్నప్పుడు రమా సావిత్రీ కవలపిల్లల్లా ఉండేవారు. ఒక్కమాటు విడవకుండా ఆడుకునేవారు. వాళ్ళక్కలంతా "రామలక్ష్మణులు" అనేవారు వీళ్ళిద్దర్నీ. రమకీ, సావిత్రికీ రామలక్ష్మణుల కున్నంత ప్రేమ ఉంది నిజంగా.

పాపను ఎత్తుకొని ముద్దులవర్షం కురిపించింది రమ. సావిత్రి తల్లివచ్చి అల్లుడితో కుశల ప్రశ్నలు ముగించుకుని సావిత్రితో వంటింట్లోకి వెళ్ళింది. అక్కలందరూ వెంబడించారు సావిత్రిని. "సావిత్రీ ఎన్నాళ్ళయిందే నిన్ను చూసి. మేం మీఇంటికివచ్చినా మీ ఆయన మన్నుతిన్నవాడిలా సరిగ్గా మాట్లాడడాయె. అలాంటప్పుడు ఒకటి రెండు రోజులకంటె ఎలాగ ఉండడం! పోనీలే తల్లీ ఇప్పటికైనా వచ్చారు. సంతోషం. అర్థంలేనివాళ్ళు వ్యర్థులమ్మా!" అంది రాజేశ్వరమ్మగారు అవ్యక్తమైన బాధతో.

"సరే దానికేంగాని అలా అనుకోకే అమ్మా! ఇప్పుడొచ్చాంగా! రమ మొగుడు ఇవాళ వస్తాడా! అని రమవైపు తిరిగి ఏమే రమా!" అంది. "వాళ్ళ ఆయనకేమీ కోపంలేదులే మీ ఆయనలా" అంది చిన్నక్కయ్య.

"అలా అనకే సుబ్బారావు మాత్రం అలాంటి వాడాయేం! ఏదో గ్రహస్థితి" అంది పెద్దక్కయ్య. "అసలు కోపం ఎలా అదృశ్యమైంది మరదిగార్కి" అంది మూడో అక్కయ్య. సావిత్రి ఎవరికీ సమాధానం చెప్పలేదు. "అబ్బ. ఉండండర్రా మన మాటలు వినపడతాయి అవతలవాళ్ళకి" అంది.

4

బావమరదితో వేళాకోళాలాడుతూ కూర్చున్న సుబ్బారావు మామగారు రాగానే లేచి నిల్చున్నాడు. నేలను చూస్తున్న సుబ్బారావునిచూసి ఆనందరావుగారు లోపలే నవ్వుకున్నాడు.

"మేల్లో వచ్చారా! అంతా కులాసా!" అన్నారు. "కులాసాగా ఉన్నామండి" అన్నాడు సుబ్బారావు. "చాలా సంతోషం బాబూ! చిన్నవాళ్ళ కోర్కెలు తీర్చడం పెద్దవాళ్ళవిధి. ఆర్థిక లోపంలేఃపోతే ఆనందంకూడాను" అన్నారు. సుబ్బారావు మౌనంగా నిల్చున్నాడు. "భోజనాలయ్యాక మాట్లాడుకోవచ్చు, రా బాబూ!" అంటూ లోపలికివెళ్ళి "సావిత్రీ! వచ్చావా! పాపయేదీ!" అన్నారు.

ఇదుగో నాన్నా! అని పాపను తండ్రికి అందిస్తూ తండ్రి కళ్ళల్లోకి చూసి నవ్వింది సావిత్రి. ఆయన కూతుర్ని ప్రేమగా చూస్తూ "ఇన్నాళ్ళకు మీ ఆయన్ను రప్పించగలిగినందుకు చాలా సంతోషంగా ఉందమ్మా!" అన్నారు. సావిత్రి సుబ్బారావుని కళ్ళతో పలకరించింది. సుబ్బారావు నవ్వుతూ ముఖం పక్కకి దాచుకున్నాడు. "నాన్నా! పాప పెద్దదయి ఆయనకుకూడా అల్లుడు వచ్చేదాకా డబ్బు విలువ, మనుష్యుల విలువ తెలిసిరాదులే" అంది.

"దానికేమిలేమ్మా! మేం పెట్టవలసిన వాళ్ళం గనుక కోరుకోడంలో తప్పేముంది!" అన్నారు అల్లుని నవ్వు కనిపెట్టి ధైర్యంగా.

5

సంక్రాంతి పండుగ ఆనందంగానూ సరదాల తోటీ గడచిపోయింది మూడు రోజులూ. ఆ తరువాత అందరు కూతుళ్లూ ప్రయాణాలయి వెళ్ళిపోయారు. సుబ్బారావుకూడా ప్రయాణం అవుతున్నాడు. తనను ముట్టవలసిన ముడుపుకోసం ఎదురుచూస్తున్నాడు ఎరగనివాడిలా. మామగారూ భార్యాకలిసి ఆడుతున్న నాటకానికి తనుకూడా ఒక పాత్రగా తయారౌతున్నాడు.

"మామగారువచ్చి రెండు రోజులు ఇంకా సెలవుందిగా. వెళ్ళవచ్చులే" అన్నారు. "పనుందండి"

అన్నాడు సుబ్బారావు. "సావిత్రిని నేను తీసుకొస్తా. నెల రోజులు మా యింట్లో ఉండి వస్తుంది" అన్నారు. "మీ ఇష్టం" అన్నాడు.

"ఇవి రెండు వందలు. నీ ఇష్టమొచ్చిన సైకిలు కొనుక్కో! ఈ నాటికి నువ్వు కోరింది ఇవ్వగలిగి నందుకు ఆనందిస్తున్నా.' అని ఇంకో ముప్పయి రూపాయలు నూటుక్కూడా ఇచ్చారు తాంబూలంతో సహా "తీసుకో బాబూ!" అంటూ ప్రోత్సాహపరుస్తూ. అతను వినయంగా వంగి మామగారి పాదములు స్పృశిస్తూ నమస్కారం చేశాడు. మామగారి బాధ అర్థంచేసుకొని మనస్సులో జాలి పడ్డాడు.

రైలుదాకా సాగనంపడానికి పాపతోకూడా వచ్చిన మామగార్ని చూస్తూ తన నిర్దయత్వానికి పశ్చాత్తాపపడ్డాడు ఆ క్షణంలో. రైలు కదిలింది. పాపకు టాటా చెబుతూ రైలుతోపాటు సాగిపోయాడు సుబ్బారావు.

6

"సావిత్రీ! ఇంత డబ్బు ఎలా పంపగలిగావమ్మా! 50 రూపాయలతో ఇంత గొప్పగా సత్కరించిన గౌరవం నాకు దక్కించావు తల్లీ!" అన్నారు ఆనందరావుగారు సావిత్రితో. "ఎదటివాళ్ల కష్టసుఖాలు ఆయనకు తెలియవు నాన్నా! మనస్సు వెన్నలాంటిదే - డబ్బుకు విలువ ఇవ్వరు ఆయన. జీతంలో నెలనెలా పది రూపాయలు దాచినా నమ్మకమే నా యందు. ఇక్కడకు రాకుండా ఉండలేక ఈ పనిచేశాను. రెండేండ్లనుంచి దాచితే ఈ నూటఎనభైరూపాయలు పంపగలిగాను. అక్కల్ని చూసి సరిగ్గా మూడు సంవత్సరాలయింది" అంటూంటే సావిత్రి కళ్ళు చెమ్మగిల్లాయ్. "పాప పెద్దదయ్యేటప్పటికి నీ సొమ్ము నీకు ఇచ్చేస్తా తల్లీ! నేను రిటైరయితే గవర్నమెంటు కొంత డబ్బిస్తుంది నాకు. నీవు మనిఆర్డరు చేశావనికూడా ఇంట్లో ఎవళ్లకీ చెప్పలేదు. ఒకళ్లనుచూసి ఒకళ్లు కోపగిస్తే నేను చేసేదేముంది చెప్పమ్మా" అన్నారు.

"అలాగే నాన్నా! సొమ్ము మీ అల్లునికే ఇచ్చారుగాని మీరు తిన్నారా!" అంది సావిత్రి. "మేం పెట్టవలసినవాళ్లం కాదుటమ్మా ఉన్నా లేకపోయినా" అన్నారు ఆయన. "మాకిప్పుడేం లోటులేదు. మీరలా బాధపడగూడదు నాన్నా!" అంది సావిత్రి.

ఇంతలో రాజేశ్వరమ్మగారువచ్చి "ఏమిటి తండ్రీ కూతురూ చెప్పుకుంటున్నారు!" అంది.

"ఏమీలేదే-మన సావిత్రి ఏంచేసిందో తెలుసా! మనం సుబ్బారావుకి ఇస్తామన్న సైకిలు కొనమని నూటఎనభై రూపాయలు పంపింది పండుగ ముందర" అన్నారు. రాజేశ్వరమ్మగారు విస్తుపోయి "ఆ వేళ మనియార్డరు అదా! సావిత్రి బోధవల్ల సుబ్బారావు తిక్క తిరిగి ఈ పండక్కు తీసుకువచ్చాడనుకున్నా" అంది. "ఎలాగైతేనేం సావిత్రి ప్రజ్ఞవల్లే తిక్క తిరిగింది అతనికి. ఈ సంక్రాంతి పండుక్కి అతను సావిత్రిని తీసుకురావడానికీ, మనం అంతా సంతోషించడానికీ సావిత్రే కారణం" అన్నారు ఆనందరావుగారు.

సావిత్రి పుట్టింట్లో నెలరోజులు ఉంది. రమకూడా సావిత్రి ఉన్నన్నాళ్లూ ఉంది తనివితీరక. ఉండడానికి వీలులేక పెద్దక్కలు మాత్రం వెళ్లిపోయారు. ఆనందరావుగారు మంచి రోజుచూసి సావిత్రిని అత్తింట్లో దిగబెట్టివచ్చారు.

ఆ రోజు రాత్రి సుబ్బారావు అన్నాడు సావిత్రితో.

"నువ్వు పుట్టింటికి వెళ్ళావు, మీ నాన్నగార్కి గొప్ప దక్కింది. నేనే చేతగానివాణ్ణనుకున్నారు తండ్రీ కూతురూ" అన్నాడు.

"అదేమిటి! మీకు చేతగానిదేముంది! చక్కగా డబ్బు మా నాన్న దగ్గర తీసుకున్నారు పట్టుబట్టి. ఇంక సైకిలు కొనుక్కుంటారు" అంది. "అప్పు వారి అప్పూ తీరింది అల్లుని మనసూ తీరింది" అందిట నీలాంటిదే ఒకావిడ. నువ్వు చేసినపని నాకు తెలియ

దనుకున్నావు? శ్యామలాంబగారి తమ్ముడు: మీ నాన్నగారిపేర మనియార్డరు చేస్తూంటే ఆ రోజే చూశాను.

నేను కాలేజీకి వెళ్ళగానే డబ్బు ఇచ్చావు మీ నాన్నగారిపేర మనియార్డరు చెయ్యమని అతనికి. అతను మర్నాడు ప్రొద్దున్న పోస్టాఫీసు దగ్గిర నన్ను చూసి "పిన్నిగారు ఇచ్చిన డబ్బు నిన్న వీలులేక ఇవాళ పంపుతున్నానండి. క్షమించాలి" అన్నాడు. నాకప్పుడే అర్థమైంది నీ ప్లాను. నేనూ తెలియనట్లే ఊరుకున్నా. ఎప్పటికి నువ్వు చెబుతావో చూద్దామనీ, బతే దానవు! ఇప్పటిదాకా ఇంకా అభినయిస్తున్నావూ?" చిరుకోపం అభినయిస్తూ అన్నాడు. "ఆ" అని తెప్పరిల్లి "మీ రెన్నాళ్ళకూ పంపకపోతే ఏంజెయ్యమన్నారు?" అంది 'విన యంగా. "డబ్బు నీ చేతులో ఉందిగా. నీ ఇష్ట మొచ్చినట్లు చేశావు!" అన్నాడు. "నా ఇష్టం కాదండీ! ఆడదానికి పుట్టింటి ఆశ ఉండడం తప్పా!" అంది నేల చూపులతో. "నాకు అత్తింటి ఆశ ఉండడమే తప్పు-ఔనా!" అన్నాడు నవ్వుతూ.

"ఎవరిదీ తప్పుకాదు. మా నాన్న రిటైరై నాక వచ్చే డబ్బుతో మీ బాకీ తీరుస్తాడులెండి. ఆయన సర్వీసు ఇంక రెండేండ్లు. అంతవరకూ కాస్త ఓపిక పట్టండి" అంది.

"ఓపిక ఇప్పుడే పట్టాను. మరొకడైతే నువ్వు చేసిన పనికి ... "

"ఏం - ఒదిలేస్తారా?" అంది నవ్వుతూ. "ఏమో ఏంచేద్దునో కాని నువ్వంటే నాకు ... కోపంలేదుగా!". అని సావిత్రి పూర్తిచేసింది అతను చెప్పబోయే మాటను.

"రైట్. సరిగ్గా చెప్పావు?" అన్నాడు లాలనగా.

"ఫస్టుమార్కు వస్తుందా!" అంది. ఇద్దరూ నవ్వేరు. ఇద్దరి నవ్వులూ ఏకమై గదంతా వెన్నెల విరిసింది.

మహాత్మాగాంధీ బోధనా సూత్రం

మహాత్మాగాంధీ జీవిత విధానాన్ని గురించి ఆయన. ప్రబోధించిన సూత్రాలను గురించి తెలియ జెప్పడానికి ఢిల్లీలోని పాఠశాలా విద్యార్థుల ప్రయోజనం కేంద్రీ విద్యా, వైజ్ఞానిక పరిశోధనల మంత్రిత్వశాఖ వరుసగా కొన్ని ప్రత్యేక ప్రసంగాలను ఏర్పాటుచేస్తోంది. ఈ కార్యక్రమం క్రింద ప్రసంగించ వలసిందని కేంద్రీ విద్యామంత్రిత్వశాఖ మహాత్మాగాంధి మనుమరాలైన కుమారి మణిబెన్ గాంధీని ఆహ్వానించింది.

ఈ కార్యక్రమాలలో మొదటి ప్రసంగం ఢిల్లీకరోల్ బాగ్‌లో రాయ్ కేదారనాధ్ బాలికా పాఠశాలలో ఏర్పాటు చేయబడింది.

కుమారి మణిబెన్ గాంధీ అక్కడ ప్రసంగిస్తూ మహాత్మాగాంధీ జీవితంలోని ప్రముఖఘట్టాలను గురించి వివరించారు. మహిళలలో చైతన్యం తీసుకురావడానికి మహాత్మాగాంధీ బోధనలు ఎలా దోహదం చేశాయో ఆమె చెప్పారు.

మహాత్మా గాంధీ భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించడమేగాక, ఆయన ప్రపంచానికి మానవతావాదాన్నీ, సత్యశీలాన్నీ, చిత్తశుద్ధినీ, ధైర్యాన్నీ బోధించారనీ యీ సందర్భంలో ప్రసంగిస్తూ భారత ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారు, శ్రీ కె. జి. సయ్యిదీన్ పేర్కొన్నారు.

కేంద్ర విద్యామంత్రిత్వశాఖ మహాత్మాగాంధీని గురించీ, ఆయన సూత్రాలను గురించీ, యిలాంటి ప్రసంగాలను ఢిల్లీలోనేగాక, దేశంలోని ఇతరప్రాంతాలలోకూడా ఏర్పాటు చేయతలపెట్టింది.